## క్లుప్తంగా

### ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక డ్రైవ్

**వేపాడ:** ఆధార్ కార్డులు తీసుకుని పదేళ్లు దాటిన వారంతా తమ ఆధార్‌ను విధిగా అప్‌డేట్ చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఆధార్ అప్‌డేట్‌కు ఈనెల 18, 19, 20, 26, 27వ తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలో వల్లంపూడి, వావిలపాడు, సోంపురం, కుమ్మపల్లి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలనుకునే వారు తమ ఆధార్‌కార్డులతో ఆయా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

### గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించండి



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న లైబ్రేరియన్ శ్రీధర్, విద్యార్థులు

**లక్కవరపుకోట:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం అదనపు భవన నిర్మాణానికి సహకారం అందించాలని లైబ్రేరియన్ దామోదర్ శ్రీధర్, విద్యార్థులు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావును కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని సోమవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయ భవనంపై దాతలు అందించిన రూ.6 లక్షలతో అదనపు భవనాన్ని నిర్మించామని చెప్పారు. ప్రస్తుతం ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ తదితర పనులు చేయాల్సి ఉందని, ఈ పనులకు మండల పరిషత్ నుంచి రూ.2.3 లక్షలు కేటాయించాలని కోరారు. ఎంపీపీ స్పందిస్తూ బుధవారం నిర్వహించనున్న మండల పరిషత్ సాధారణ సమావేశంలో తీర్మానం చేసి నిధులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు.

### చినగుడిపాలలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

**వేపాడ:** మండలంలోని చినగుడిపాల గ్రామంలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారిరాజు ఆధ్వర్యంలో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. 64 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య తనిఖీలు చేశారు. సర్పంచ్ బి.రామునాయుడు, ఉపసర్పంచ్ ఎల్.దేముడు, హెల్త్ సూపర్‌వైజర్ వి.వెంకటరమణ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

### జాగ్రత్తలు పాటించాలి



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సుధారాజు, తదితరులు

**శృంగవరపుకోట:** ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైస్ ఎంపీపీ సుధారాజు సూచించారు. మండలంలోని ముషిడిపల్లిలో పంచాయతీ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. పాదచారులు, ప్రయాణికులకు సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు, యువతతో కలిసి మజ్జిగ పంపిణీ చేశారు.

### బీమా పథకాలను వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ తిరుమలేశ్వరరావు

**లక్కవరపుకోట:** ప్రభుత్వ బీమా ,పింఛన్ పథకాలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగించుకోవాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ)కొత్తవలస శాఖ మేనేజర్ జి.తిరుమలేశ్వరరావు సూచించారు. మండలంలోని తామరాపల్లి గ్రామంలో ప్రజలకు బ్యాంకు సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్ష యోజన పథకం కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే, ప్రీమియం కట్టిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.2లక్షలు,జీవన జ్యోతి యెజన కింద ఏటా రూ.436 చెల్లిస్తే ప్రీమియందారు సహజ మరణం చెందినా రూ.2లక్షలు బీమా సొమ్ము అందజేస్తామన్నారు. అటల్ పింఛన్ యోజనలో చేరి ప్రతీ నెల నిర్ణీత ప్రీమియం చెల్లిస్తే 60 సంవత్సరాల తర్వాత నెల నెలా పింఛన్ అందజేస్తామన్నారు. ఐఆర్ఐఎక్స్‌డిపార్ట్‌మెంట్ చానల్ మేనేజర్ సీహెచ్.మాధవరావు, సీఎస్పీ గురి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకూ ప్రభుత్వం అండ

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య
- విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల ఎంపిక శిబిరం విజయవంతం

**గజపతినగరం:** విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను తీరుస్తున్నామని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గజపతినగరం నియోజకవర్గంలోని గజపతినగరం,బొండపల్లి, దత్తిరాజేరు, గంట్యాడ, మండలాలతో పాటు సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలా లకు సంబంధించిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవసర మైన ఉపకరణాలు పంపిణీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలిమ్‌కో సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయించినట్టు చెప్పారు. ఎంపికైన వారికి, వారి అవసరాల ఆధారంగా మూడు చక్రాల సైకిళ్లు వీల్ చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలీఫర్స్, రోలేటర్స్, వినికిడి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిళ్లు అందించనున్నట్టు చెప్పారు. శిబిరానికి 490 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరు కాగా వారికి ఆలిమ్‌కో సంస్థ సిబ్బంది పరీక్షలు చేసి ఉపకరణాల కోసం 353 మందిని గుర్తించి, వివరాలు ఆన్‌లైన్ చేశారని చెప్పారు. పరికరాలు అదనంగా అవసరం అనుకుంటే సీఎస్ఎఫ్ ఫండ్ ద్వారా తెప్పించేందుకు మంత్రి బొత్ససత్యనారాయణ మాట ఇచ్చారని తెలిపారు. అలాగే నియోజకవర్గం నుంచి గతంలో మూడు చక్రాల బ్యాటరీ స్కూటీల కోసం పదిమంది దివ్యాంగులు రాష్ట్రప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, వారికి ప్రభుత్వం స్కూటీలు సమకూర్చింది. గతంలో ఒకరికి మంత్రి బొత్స సత్యనారాయణ స్కూటీ అందజేయగా, మిగతా తొమ్మిది మందికి ఎమ్మెల్యే అప్పలనరసయ్య సోమవారం అందజేశారు. విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ ఏడీ జి.వి.జగదీష్, అయిదు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, నాయకులు నారాయణమూర్తిరాజు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్,ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గతంలో ఎంపికైన దివ్యాంగులకు స్కూటీలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

# వేతనదారులందరికీ పని కల్పిస్తున్నాం

**కొత్తవలస:** ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు ఉన్న వేతనదారులందరికీ పని కల్పిస్తున్నామని ఆ పథకం ఏపీఎం ఎం.విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని కంటకాపల్లి గ్రామం లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మదీన అప్పలరమణతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్స రానికి సంబంధించి రూ.17.13 లక్షల అంచనా బడ్జెట్‌తో పనులు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం రోజువారీ సరాసరి 5వేల మంది పనికి హాజరవుతునట్టు తెలిపారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

**వలసల నివారణకే..**

**చీపురుపల్లి:** వలసలు నివారించి, స్థానికంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనా యుడు తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ పరిధి వేపల చెరువులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధిం చి ఉపాధి పనులను సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి తో కలిసి సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు కోసం ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, గిరడ రాందాసు, దాలయ్య, కృష్ణ, ఆది పాల్గొన్నారు.



చీపురుపల్లి: ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

### గొల్లుపాలెంలో భూసర్వే

**బొండపల్లి:** వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని దేవుపల్లి రెవెన్యూ పరిధిలోని గొల్లుపాలెం గ్రామంలో సమగ్ర భూరీసర్వేను రెవెన్యూ అధికారులు సోమవారం ప్రారంభించారు. డ్రోన్ ద్వారా సర్వే చేపట్టారు. గ్రామ సర్పంచ్ పోతల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతల కన్నంనాయుడు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

**లక్కవరపుకోట:** మానవహక్కుల కౌన్సిల్ క్యాలెండర్‌ను స్థానిక తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్, ఎంఈఓ కార్యాల యాల్లో మానవహక్కుల కౌన్సిల్ ప్రతినిధులు జామి అప్పలరాజు, రావాడ నాయుడు ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఆవిష్కరించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధు లు మాట్లాడుతూ ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

### గురుకుల ప్రవేశ పరీక్ష హాల్‌టిక్కెట్లు విడుదల

**వేపాడ:** ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో అయిదోతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించనున్న పరీక్షకు సంబంధించిన హాల్‌టిక్కెట్లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో విడుదల చేసిందని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అయిదోతరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హాల్‌టిక్కెట్లను హెచ్‌టీటీపీ://ఏపీజీపీసీఈఓ.ఏపీసీఎఫ్ఎస్‌సీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలు ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారని, విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ పెన్ మాత్రమే వినియోగించాలని, హాల్ టిక్కెట్‌లో విద్యార్థి ఫొటో సరిగా లేకపోతే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించాలని సూచించారు.పరీక్షకు అరగంట ముందుగా హాజరు కావాలని తెలిపారు.

# సమస్యలకు సత్వర పరిష్కారం



బొండపల్లి: స్పందనలో వినతులు స్వీకరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు



మెరకముడిదాం: అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

**బొండపల్లి:** 'స్పందన' కార్యక్రమంలో అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకూ సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా,ఎంపీడీఓ ఏ.వేదవతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**దత్తిరాజేరులో..**

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన'స్పందన'కు రెండు వినతులు అందాయి. అనంతరం మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లోనే వినతులు స్వీకరించి, సమస్యలు పరిష్కరించా లని సూచించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు.

**మెరకముడిదాంలో..**

**మెరకముడిదాం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 'స్పందన' నిర్వహించారు. భైరిపురం గ్రామానికి చెందిన శనపతి నాగకుమారి తనకు జగనన్న చేదోడు రావడంలేదని, పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. అదే గ్రామానికి చెందిన రైతు శనపతి కృష్ణ తన బోరుబావికి 200 మీటర్ల లోపునే మరొక రైతు బోరు వేస్తున్నారని, నిబంధనల ప్రకారం 200 మీటర్లలోపు బోరు వేయకూడదని ఫిర్యాదు చేశారు.

**గజపతినగరంలో..**

**గజపతినగరం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ డి.జనార్దనరావు ఆధ్వర్యంలో 'స్పందన' నిర్వహించారు. గజపతినగరం గ్రామానికి చెందిన ఇద్దరు, పురిటిపెంట గ్రామానికి చెందిన ఒకరు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

# టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

**కొత్తవలస:** ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు ఇళ్లకు వచ్చి మాయమాటలు చెబుతారని, వారితో ప్రజలు బహుపరాక్‌గా ఉండాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హితవు పలికారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం– 1 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, విద్య,వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ దమ్ము రమణ, పార్టీ నాయకులు గొరపల్లి రవి, మేలాస్త్రి అప్పారావు పాల్గొన్నారు.

**పేదల అభ్యున్నతే ధ్యేయం**

**గజపతినగరం రూరల్:** పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని పాతబగ్గాం గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మరలించాలని టీడీపీ, ఎల్లోమీడియా నిత్యం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్రను చూస్తుంటే పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నంటుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ఒక పండగలా సాగిందని గుర్తు చేశారు. పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చినా లోకేష్ పాదయాత్ర ఎక్కడికక్కడే నవ్వులపాలవుతోందని ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, స్థానిక ఎంపీటీసీ అప్పయ్యమ్మ, మండల నాయకులు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాథ, మండల సురేష్, కరణం ఆదినారాయణ, కనకల సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్, తహసీల్దార్ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు వేంద్రాంలో..**

**బొండపల్లి:** మండలంలోని వేంద్రాం గ్రామంలో మంగళవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు, ఎంపీడీఓ వేదవతి సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.



కొత్తవలస: కొత్తవలసలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



గజపతినగరం రూరల్: పాతబగ్గాంలో పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గజపతినగరం రూరల్: పాతబగ్గాంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

# జగన్ అంటేనే నమ్మకం



వేపాడ: బొద్దాంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

జగన్ అంటేనే నమ్మకమని.. చంద్రబాబు అంటే నయవంచన, నమ్మకద్రోహం, మోసానికి ప్రతిరూపమని వైఎస్సార్‌సీపీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. గజపతినగరం, చీపురుపల్లి, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో 'జగనన్నే మా భవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం సోమవారం కొనసాగింది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజాభిప్రాయం సేకరించారు. టీడీపీ పాలనలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేశారు. సీఎం జగన్ సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. అనంతరం ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం ను వ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. వేపాడ మండలం బొద్దాంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన దివ్యాంగుడు ముచ్చకర్ల చిన్నోడు (45) సాంకేతిక కారణాలవల్ల తనకు పింఛన్ రాలేదని, తల్లిదండ్రులు చనిపోవడంతో ఒక్కడినే పాకలో నివసిస్తున్నాని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు స మస్య వివరిచారు. ఎమ్మెల్సీ స్పందించి పింఛన్ మంజూరయ్యే వరకు తన సొంతు నిధులు నెలకు వెయ్యిరూపాయలు చొప్పున ఇస్తానని భరోసా ఇచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: పెనుబర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, గృహసారథులు



దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో పథకాల అమలుపై సర్వే చేస్తున్న వైస్ ఎంపీపీ అప్పలనాయుడు



మెరకముడిదాం: చినబంటుపల్లిలో పథకాల అమలుపై సర్వే చేస్తున్న నాయకుడు కృష్ణమూర్తినాయుడు, గృహసారథులు



బొండపల్లి: గొట్లాంలో పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, గృహసారథులు

# అర్హతే ప్రామాణికం

**గుర్ల:** అర్హతే ప్రామాణికంగా పార్టీలతో సంబంధం లేకుండా, లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పల్లిగండ్రేడులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, అవి అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పాలవలస శంకరరావు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారు రూ.9.50 లక్షల లబ్ధి చేకూరుడంతో ఆ కుటుంబ సభ్యులు నాయకుల వద్ద తమ సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, నాయకులు బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, బోర్ల సుబ్రహ్మణ్యం, కెంగువ మధుసూదనరావు, జమ్ము స్వామినాయుడు, మణ్యపురి రామారావు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



చీపురుపల్లి: కర్లాం ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖాధికారి హేమసుందర్



కొత్తవలస: గ్యాస్ సిలిండర్ నుంచి వచ్చే మంటలను అదుపుచేయడంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

**చీపురుపల్లి/కొత్తవలస/గజపతినగరం/శృంగవరపుకోట:** అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చీపురుపల్లి, కొత్తవల స, గజపతినగరం ,శృంగవరపుకోట మండలాల అగ్నిమాపకశాఖ అధికారులు హేమసుందర్, వై.అశోక్‌కుమార్, ఎం.ఎ స్.వి.రవిప్రసాద్, షేక్ మదీనా అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కర్లాం ఉన్నత పాఠశాల, కొత్తవలస మండలం మంగళపాలెంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్, గజపతినగరంలోని వివేకానంద పాఠశాల, ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. గ్యాస్‌ఫైర్,ఆయిల్ ఫైర్ తదితర ప్రమాదాల్లో మంటల ఆర్పేతీరును ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే ప్రమాదవశాత్తు నీటిలో మునిగిన వ్యక్తులను కాపాడే విధానాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా నిర్లక్ష్యం కారణంగానే ఇళ్లల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని, ఇళ్లల్లో వంట పూర్తయ్యాక గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని చెప్పారు. ఇళ్లలో నాణ్యమైన విద్యుత్ వైరింగ్ చేయించుకోవాలని, నాసిరకం వైరింగ్ ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు.



గజపతినగరం: మంటలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది